క్లుప్తంగా

మంత్రి 'పొన్నం'ను కలిసిన ఎమ్మెల్యే

నర్సంపేట : హైదరాబాద్‌లోని తెలంగాణ సచివాలయంలో రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖల మంత్రి పొన్నం ప్రభాకర్‌ను స్థానిక ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. నియోజకవర్గ అభివృద్ధికి సంబంధించిన పలు విషయాలపై చర్చించారు. కార్యక్రమంలో టీపీసీసీ సభ్యుడు పెండెం రామానంద్, తదితరులు పాల్గొన్నారు.

డీఎన్‌ఎస్‌ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా మదన్



వర్ధన్నపేట : వర్ధన్నపేటకు చెందిన చల్లా మదన్‌ను దళిత నిరుద్యోగ సంక్షేమ సంఘం (డీఎన్‌ఎస్‌ఎస్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా నియమించినట్లు రాష్ట్ర అధ్యక్షుడు తుమ్మల కుమారస్వామి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. తనకు పదవి ఇచ్చిన కుమారస్వామికి కృతజ్ఞతలు తెలిపారు. పదవికి న్యాయం చేస్తానని చెప్పారు.

వాహనాల తనిఖీ

పర్వతగిరి : మండలంలోని అన్నారం గ్రామంలో ఎస్సై వీరభద్రరావు ఆధ్వర్యంలో వాహనాలను బుధవారం రాత్రి తనిఖీ చేశారు. డ్రంకన్ డ్రైవ్ టెస్ట్ నిర్వహించడంతోపాటు వాహనదార్ల డ్రైవింగ్ లైసెన్స్, ఇతర పత్రాలు పరిశీలించారు. నిబంధనలు ఉల్లంఘించిన పలువురికి జరిమానా విధించారు. కార్యక్రమంలో కానిస్టేబుళ్లు నరేశ్, సదానందం పాల్గొన్నారు.

ఆదర్శవంతంగా తీర్చిదిద్దాలి



వర్ధన్నపేట: మహిళలు ఆదాయ అభివృద్ధి కార్యక్రమాలతో సుస్థిర జీవనోపాధులు ఏర్పాటు చేసుకుని వర్ధన్నపేటను ఆదర్శ మండలంగా తీర్చిదిద్దాలని డీఆర్‌డీఏ జిల్లా అడిషినల్ డైరెక్టర్ కొట్టె శ్రీనివాస్ అన్నారు. బుధవారం వర్ధన్నపేటలో సెర్ప్ కార్యాలయంలో వీఓల క్షేత్రస్థాయి సిబ్బందికి నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా మాట్లాడారు. సెర్ప్ కార్యక్రమాలతో స్వయం సహాయక సంఘాల సభ్యులను అన్ని రంగాల్లో ఆదర్శంగా తీర్చిదిద్ది మండలాన్ని దేశంలోనే ప్రథమ స్థానం సాధించేందుకు కృషి చేయాలన్నారు. సమావేశంలో జిల్లా ప్రాజెక్టు మేనేజర్లు మునిగాల దయాకర్, అనిత, ఏటీఎంలు వీర్ల వేణు, పులుసు అశోక్, సీసీలు కొమురయ్య, స్వామి, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

చదువుల దినోత్సవం



నల్లబెల్లి : మండల కేంద్రంలోని గ్రంథాలయంలో దళిత విద్యావంతుల వేదిక ఆధ్వర్యంలో అంతర్జాతీయ చదువుల దినోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. చదువుల తల్లి సరస్వతి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం బట్టు సాండబయ్య మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు పరికి రత్నం, గుమ్మడి వేణు, రాయరాకుల సంతోశ్, అడ్డగట్ల రాజు, తదితరులు పాల్గొన్నారు.

కమిటీ ఎన్నిక

రాయపర్తి : మండలంలోని తిర్మలాయపల్లి శ్రీ లక్ష్మీనృసింహస్వామి ఆటో యూనియన్ కమిటీని బుధవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా మేరుగు రంజిత్, ఉపాధ్యక్షుడిగా వశపాక కుమార్, కార్యదర్శిగా వశపాక హరీశ్, సభ్యులుగా చెల్లోజు నాగయ్య, ఆడెపు నర్సింహరాములు, వశపాక కొంరయ్య, బరిగెల యాకయ్య, ముద్రబోయిన వెంకన్న తదితరులు ఎన్నికయ్యారు.

నివాళి

నర్సంపేట : ఓబీసీ సెల్ రాష్ట్ర కోఆర్డినేటర్ కత్తి వెంకటస్వామి తల్లి తిరుపతమ్మ అనారోగ్యంతో మంగళవారం మృతి చెందగా కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ కన్వీనర్ తక్కళ్లపల్లి రవీందర్‌రావు, నాయకులు పూలమాల వేసి నివాళులర్పించారు. తిరుపతమ్మ మృతదేహానికి మోకుదెబ్బ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ అనంతుల రమేశ్ పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం నాయకులు వెంకటస్వామిని, కుమారస్వామి కుటుంబాన్ని పరామర్శించారు. అలాగే శివనగర్‌కు చెందిన సకినాల కుమారస్వామి మృతి చెందగా ఆయన మృతదేహానికి కౌన్సిలర్ నాగిశెట్టి పద్మప్రసాద్ పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం పద్మ ప్రసాద్ బాధిత కుటుంబానికి రూ.5 లక్షలు సాయం అందజేశారు.

ఆర్థికసాయం

రాయపర్తి: మండలంలోని పెర్కవేడుకు చెందిన పట్లోజు జగన్నాథాచారి ఇటీవల మృతి చెందగా బాధిత కుటుంబానికి కోటకాల్వ యువజన సంఘం సభ్యులు బుధవారం రూ.7,500 సాయం అందజేశారు. కార్యక్రమంలో సభ్యులు కొంక మురళి, బోళ్ల కుమార్, దురిశెట్టి సంతోశ్, దురిశెట్టి సుధాకర్, దురిశెట్టి రాజు, కోలుకొండ రాజు, కోలుకొండ హరీశ్, ఊగ సురేశ్, తదితరులు పాల్గొన్నారు.

బాలికల రక్షణ సామాజిక బాధ్యత



నర్సంపేట : మొక్కను నాటుతున్న విద్యార్థులు



నర్సంపేట : సన్మానిస్తున్న అధికారులు



దుగ్గొండి : బ్యాగులు అందిస్తున్న హెచ్‌ఎం

● అంతర్జాతీయ దినోత్సవంలో వక్తలు

నర్సంపేట : బాలికల రక్షణ, అభ్యున్నతిని సామాజిక బాధ్యతగా వక్తలు అభివర్ణించారు. నర్సంపేట ప్రాజెక్టు పరిధిలోని రామాలయం పాఠశాల ఆవరణలోని అంగన్‌వాడీ కేంద్రంలో జాతీయ బాలిక దినోత్సవాన్ని గురువారం వేడుకగా నిర్వహించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు వి.సతీశ్‌కుమార్, అంగన్‌వాడీ టీచర్ నల్ల భారతి మాట్లాడారు. ఆడపిల్లలు ప్రతి ఇంటికీ అదృష్టమని చెప్పారు. ప్రభుత్వ బాలికల హైస్కూల్‌లో స్వయంకృషి సోషల్ వర్క్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో ఎఫ్‌ఎంఎం సోషల్ సర్వీస్ సొసైటీ సహకారంతో నిర్వహించిన కార్యక్రమంలో రిసోర్స్‌పర్సన్‌గా స్వయంకృషి సంస్థ నిర్వాహకుడు బెజ్జంకి ప్రభాకర్ పాల్గొని మాట్లాడారు. బాలికల రక్షణ, అభివృద్ధి కోసం సమాజంలోని ప్రతీఒక్కరు పాటుపడాలని ఆకాంక్షించారు. బాలికలు ఎలాంటి ఆపదలు, సమస్యలు ఎదురైనా వెంటనే చైల్డ్ హెల్ప్‌లైన్-1098, 100 టోల్ ఫ్రీ నంబర్లకు ఫోన్ చేయాలని సూచించారు.

విద్యార్థులకు బ్యాగుల పంపిణీ

దుగ్గొండి : మండలంలోని నాచినపల్లి ప్రభుత్వ హైస్కూల్‌లో థౌజండ్ పిల్లర్స్ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో హెచ్‌ఎం జ్యోతిలక్ష్మి చేతుల మీదుగా విద్యార్థులకు బ్యాగులు అందజేశారు. అనంతరం హెచ్‌ఎం మాట్లాడారు.

ఎంజేపీ గురుకులంలో వైద్యశిబిరం

మండలంలోని గిర్నిబావి గ్రామంలోని మహాత్మా జ్యోతిరావుపూలే (ఎంజేపీ) గురుకుల విద్యాలయంలో ఆర్‌బీఎస్‌కే ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. విద్యార్థులకు పలు రకాల రక్త పరీక్షలు చేశారు. ఈ సందర్భంగా ఆర్‌బీఎస్కే వైద్యాధికారి రవీందర్ మాట్లాడారు. ప్రతీరోజు 100 మంది విద్యార్థులకు రక్త పరీక్షలు నిర్వహిస్తామని తెలిపారు.



సంగెం : మాట్లాడుతున్న ఎంపీపీ కళావతి

కేజీబీవీలో..

సంగెం : మండలంలోని కస్తూర్బా గాంధీ గురుకుల విద్యాలయ (కేజీబీవీ)లో కేక్ కట్ చేశారు. అనంతరం ఎంపీపీ కళావతి మాట్లాడారు. ప్రతీఒక్కరు బాలికల విద్యను ప్రోత్సహించాలని కోరారు. బాలికలు విద్యావంతులైతేనే సమాజం అన్ని రంగాల్లో అభివృద్ధి చెంది సమాన హక్కులు సిద్ధిస్తాయని చెప్పారు. తల్లిదండ్రులు బాలికలపై వివక్షత పాటించొద్దని సూచించారు. బాలబాలికలను సమానంగా చూడాలని కోరారు. కార్యక్రమంలో ప్రత్యేక అధికారి నీలిమ, తదితరులు పాల్గొన్నారు.



గీసుకొండ : మెమెంటో తీసుకుంటున్న నందిని

వరంగల్‌లో సన్మానం

నర్సంపేటకు చెందిన మాతృభూమి చారిటబుల్ ట్రస్ట్ సంజీవని ఆశ్రమ విద్యార్థులను, జాతీయ క్రీడాకారిణిగా గుర్తింపు పొందిన గ్రేటర్ వరంగల్ నగర పరిధిలోని మొగిలిచర్ల జెడ్పీ హైస్కూల్ పదో తరగతి విద్యార్థిని బి.నందినిని, బాల్యవివాహాలు జరగని పంచాయతీలుగా గుర్తింపు పొందిన నేపథ్యంలో ఖానాపురం సర్పంచ్ శాఖమూరి చిరంజీవి, పంచాయతీ కార్యదర్శి సట్ల సుప్రజనను, గీసుకొండ మండలంలోని మరియపురం, గంగదేవిపల్లి గ్రామాల సర్పంచ్‌లు అల్లం బాలిరెడ్డి, గోనె మల్లారెడ్డి, పంచాయతీ కార్యదర్శులు స్వప్న, రంజిత్‌కుమార్‌లను, అంగన్‌వాడీ టీచర్లు ఊర్మిళాదేవి, స్వరూప, చెన్నారావుపేట మండలంలోని తిమ్మరాయినిపహాడ్, పదహారుచింతల్‌తండా గ్రామాల పంచాయతీ కార్యదర్శి రాజ్‌కుమార్, మమత, అంగన్‌వాడీ టీచర్లు అరుణకుమారి, దేవిలను అధికారులు వరంగల్‌లో అధికారులు సన్మానించారు.



ఖానాపురం : అవార్డులు అందుకుంటున్న సర్పంచ్, పంచాయతీ కార్యదర్శులు



గీసుకొండ : మరియపురం జీపీ కార్యదర్శిని, అంగన్‌వాడీ టీచర్‌ను సన్మానిస్తున్న అధికారులు



చెన్నారావుపేట:అవార్డు అందుకున్న అంగన్‌వాడీ టీచర్ అరుణ, పంచాయతీ కార్యదర్శి మమత

రైతు సంక్షేమమే ధ్యేయం



నర్సంపేట : రైతు సంఘం క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే మాధవరెడ్డి



పర్వతగిరి : క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న తహసీల్దార్ వెంకటస్వామి

● ఎమ్మెల్యే మాధవరెడ్డి

నర్సంపేట : రైతు సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయమని స్థానిక ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి తెలిపారు. తెలంగాణ రైతు సంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ముద్రించిన 2024 క్యాలెండర్‌ను తన క్యాంపు కార్యాలయంలో బుధవారం ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. రైతుల సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో సంఘం జిల్లా కార్యదర్శి ఈసంపెల్లి బాబు, జిల్లా ఉపాధ్యక్షుడు కోరబోయిన కుమారస్వామి, జిల్లా నాయకులు నర్సింహారెడ్డి, శ్రీనివాసరెడ్డి, ఇస్లావత్ నెహ్రూ, సంజీవరెడ్డి, మల్లయ్య పాల్గొన్నారు.

పర్వతగిరి : తెలంగాణ రైతు సంఘం మండల కమిటీ ఆధ్వర్యంలో ముద్రించిన నూతన సంవత్సర క్యాలెండర్‌ను తహసీల్దార్ వెంకటస్వామి ఆవిష్కరించారు. అనంతరం రైతు సంఘం నాయకులు మాట్లాడారు. రైతుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో సంఘం మండల కన్వీనర్ జంగ మల్లికార్జున్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు మాదాసి యాకూబ్, సీఐటీయూ మండల కన్వీనర్ జిల్లా రమేశ్, సంపత్, తదితరులు పాల్గొన్నారు.

సహ వికాస సమితి క్యాలెండర్..

నర్సంపేట రూరల్ : సమాచార హక్కు (సహ) వికాస సమితి ఆధ్వర్యంలో ముద్రించిన నూతన సంవత్సర క్యాలెండర్‌ను స్థానిక పోలీస్‌స్టేషన్‌లో టౌన్ సీఐ సుంకరి రవికుమార్ ఆవిష్కరించారు. అనంతరం వికాస సమితి బృందాన్ని అభినందించారు. సమాచార హక్కు చట్టంపై ప్రజల్లో చైతన్యం పెంచాలని చెప్పారు. కార్యక్రమంలో ఆర్‌టీఐ మండల అధ్యక్షుడు చెట్టే రమేశ్, జక్కోజు కృష్ణ, ఉడుత రాజు, సోడా రాజు, తదితరులు పాల్గొన్నారు.

యూటీఎఫ్ క్యాలెండర్..

నల్లబెల్లి : యూటీఎఫ్ క్యాలెండర్‌ను ఆ సంఘం మండల అధ్యక్షుడు నాంపల్లి రాజయ్యతో కలిసి మండల నోడల్ అధికారి శ్రీనివాసరావు ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడారు. కార్యక్రమంలో ఆ సంఘం మండల ప్రధాన కార్యదర్శి ఎడవల్లి రాజిరెడ్డి, జిల్లా కోశాధికారి రవూఫ్, మండల కోశాధికారి రాయబోస్, తదితరులు పాల్గొన్నారు.



నర్సంపేట రూరల్ : క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న సీఐ రవికుమార్



నల్లబెల్లి : యుటీఎఫ్ క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న శ్రీనివాసరావు

కేంద్ర ప్రభుత్వ పథకాలతో మేలు

● ఎస్‌బీఐ మేనేజర్ మోహన్‌కాంత్

చెన్నారావుపేట : కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సబ్సిడీ రుణాలు, బీమా, ఇతర పథకాలతో ప్రజలకు మేలు జరుగుతుందని ఎస్‌బీఐ మేనేజర్ మోహన్‌కాంత్ తెలిపారు. మండలంలోని శంకరం తండాలో బుధవారం నిర్వహించిన భారత్ సంకల్ప్ యాత్ర సభకు ఆయన హాజరై మాట్లాడారు. గ్రామీణ ప్రాంత ప్రజల కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనేక పథకాలు అమలు చేస్తున్నాయని చెప్పారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ పథకాలను గ్రామీణ ప్రాంత ప్రజలకు తెలియజేసేలా భారత సంకల్ప్ యాత్ర ప్రదర్శన చేపట్టినట్లు తెలిపారు. సామాజిక బాధ్యతగా బ్యాంకులు అమలు చేస్తున్న బీమా పథకాలు, రుణాలు, సబ్సిడీ పథకాలను అర్హులు వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ భద్రు, ఎంపీటీసీ శ్రీధర్ రాజు, యూనియన్ బ్యాంకు కోఆర్డినేటర్ కల్యాణ్, పంచాయతీ కార్యదర్శి ప్రమీల, భారత్ గ్యాస్ ఏజెన్సీ మేనేజర్ శ్రీధర్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మేనేజర్ మోహన్‌కాంత్

బాధ్యతగా విధులు నిర్వర్తించండి



మాట్లాడుతున్న ఏపీడీ సాయిచరణ్

చెన్నారావుపేట : పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించాలని ఏపీడీ సాయిచరణ్ సూచించారు. మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లతో బుధవారం నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామాల్లో ఈజీఎస్ కూలీల సంఖ్య పెంచాలని చెప్పారు. నర్సరీల్లో సకాలంలో బ్యాగ్ ఫిల్లింగ్ పూర్తి చేసి మొక్కల పెంపకాన్ని చేపట్టాలని తెలిపారు. ఈజీఎస్ పనుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే శాఖాపరమైన చర్యలు తప్పవని స్పష్టం చేశారు. సమావేశంలో ఎంపీడీఓ భారతి, ఎంపీఓ శ్రీధర్ రాజు, ఏపీఓ అరుణ, ఈసీ కిశోర్ పాల్గొన్నారు.

నేరాల నివారణకు చైతన్యం అవసరం

నర్సంపేట రూరల్ : నేరాల నివారణ కోసం ప్రజల్లో చైతన్యం అవసరమని స్థానిక టౌన్ సీఐ ఎస్.రవికుమార్ తెలిపారు. పట్టణంలోని వల్లభ్‌నగర్‌లో పోలీసు జాగృతి కళాబృందం ఆధ్వర్యంలో నిర్వహించిన కళాజాత కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. మెరుగైన సమాజ నిర్మాణంలో యువత కీలకమని చెప్పారు. రోడ్డు ప్రమాదాలు, డయల్ 100, బాల్యవివాహాలు, సీసీ కెమెరాల గురించి వివరించారు. గుట్కా, గంజాయి, డ్రగ్స్, తదితరాలకు దూరంగా ఉండాలని యువతకు సూచించారు. సమాజంలోని దురాచారాలు, మూఢనమ్మకాలు, సైబర్ నేరాలపై ప్రజలు అవగాహన పెంచుకోవాలని సూచించారు. మూఢనమ్మకాలపై మ్యాజిక్ షో నిర్వహించారు. సైబర్ క్రైమ్స్‌పై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎస్సై రవి, జాగృతి కళాబృందం ఇన్‌చార్జ్ నాగమణి, సభ్యులు విలియమ్స్, వెంకటేశ్వర్లు, రత్నయ్య, హోంగార్డులు శ్రీనివాస్, నారాయణ, విక్రమ్, చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సీఐ రవికుమార్

ఐక్యతా దినాలు పాటిద్దాం

నర్సంపేట : మహనీయులు మహాత్మా గాంధీ, నేతాజీ సుభాష్ చంద్రబోస్, స్వామి వివేకానంద, అష్ఫాక్, బిస్మిల్, గఫార్‌ఖాన్, తదితరుల స్మృతిలో ఈనెల 30 వరకు హిందూ ముస్లిం ఐక్యతా దినాలు పాటిద్దామని ముస్లిం మైనార్టీ నాయకుడు షేక్ జావిద్, ప్రముఖ విద్యావేత్త గుంటి రాంచందర్ ఆకాంక్షించారు. పట్టణంలోని ప్రజ్ఞ జూనియర్ కళాశాలలో బుధవారం నిర్వహించిన 'జైహో జైహో హిందూ ముస్లిం ఏక్‌హో' సభలో వారు మాట్లాడారు. దేశం కోసం గీతను చదువుతూ రాంప్రసాద్ బిస్మిల్, ఖురాన్ పఠిస్తూ అష్ఫాఖుల్లాఖాన్ 91 ఏళ్ల క్రితం చిరునవ్వులు చిందిస్తూ ప్రాణాలర్పించారని చెప్పారు. కార్యక్రమంలో ముస్లిం మైనార్టీ నాయకుడు మహ్మద్ నోమన్, ఎమ్మార్పీఎస్ నాయకుడు ప్రణయ్‌దీప్, మల్లేశం, సాయికుమార్, సంధాని, అర్షద్, షమేమ్, అంకూస్, శ్రీధర్ పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో ఎదుగుదల



పర్వతగిరి : పౌష్టికాహారం తీసుకుంటే బాలలు శారీరకంగా, మానసికంగా ఎదుగుతారని సర్పంచ్ పంజా మహేశ్, ఎంపీటీసీ సూర రమేశ్ తెలిపారు. మండలంలోని గోపనపల్లి గ్రామంలోని అంగన్‌వాడీ సెంటర్‌లో అంగన్‌వాడీ టీచర్ ఉపేంద్ర ఆధ్వర్యంలో బుధవారం పిల్లలకు అన్నప్రాసన, పుట్టిన రోజు వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్, ఎంపీటీసీ మాట్లాడారు. కార్యక్రమంలో ప్రైమరీ స్కూల్ హెచ్‌ఎం పూర్ణచందర్, ఉపాధ్యాయులు వాసవి, శ్వేత పాల్గొన్నారు.

'గతి తప్పిన రుతువు' నవల ఆవిష్కరణ



నర్సంపేట : పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల రాజనీతి శాస్త్ర అధ్యాపకురాలు మామిడాల శైలజ రచించిన 'గతి తప్పిన రుతువు' నవలను కళాశాలలో ప్రిన్సిపాల్ మల్లం నవీన్ బుధవారం ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడారు. నవల గిడుగు జాతీయ సాహితీ పురస్కారాన్ని అందుకుందన్నారు. నవల టర్నల్ సిండ్రోమ్‌తో బాధపడుతున్న మహిళలకు కూడా భవిష్యత్తు ఉందని భరోసా కలిగిస్తోందని తెలిపారు. అనంతరం రచయిత శైలజను ప్రిన్సిపాల్ నవీన్, అధ్యాపకులు అభినందించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ తోట రమేశ్, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ డాక్టర్ శ్రీనాథ్, నరేందర్, డాక్టర్ లకన్‌సింగ్, సమ్మయ్య, శివనాగ శ్రీను, త్యాగయ్య పాల్గొన్నారు.

ముదిరాజ్ కులస్తులను బీసీ'ఏ'లోకి మార్చాలి

చెన్నారావుపేట : ముదిరాజ్ కులస్తులను బీసీ 'డీ' నుంచి బీసీ 'ఏ'లోకి ప్రభుత్వం మార్చాలని ముదిరాజ్ ఎంప్లాయీస్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ (మెపా) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పులి దేవేందర్ ఆకాంక్షించారు. తీన్మార్ మల్లన్నను హైదరాబాద్‌లో దేవేందర్ బుధవారం మర్యాదపూర్వకంగా కలిసి మాట్లాడారు. రాష్ట్రంలో 60 లక్షలకుపైగా జనాభా కలిగిన ముదిరాజ్ కులస్తులు వెనుకబడి ఉన్నారని ఆందోళన వెలిబుచ్చారు. జీఓ నంబర్ 15 అమలు చేయాలని తెలిపారు. గ్రాడ్యుయేట్స్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ముదిరాజ్ కులస్తులు అండగా ఉంటారని చెప్పారు.

'అట్రాసిటి కేసు నమోదు చేయాలి'

నర్సంపేట : గిరిజన మహిళను అకారణంగా కొట్టి దుర్భాషలాడిన ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్ విభాగం సీఐ రమేశ్‌పై ఎస్సీ, ఎస్టీ, అట్రాసిటి కేసు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని లంబాడీ హక్కుల పోరాట సమితి (ఎల్‌హెచ్‌పీఎస్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వాసునాయక్ డిమాండ్ చేశారు. పట్టణంలో బుధవారం ఆయన మాట్లాడారు.

బస్సు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి



నర్సంపేట రూరల్ : మండలంలోని లక్నెపల్లి గ్రామ శివారులోని బిట్స్ కళాశాల సమీపంలోని నర్సంపేట-వరంగల్ ప్రధాన రహదారిపై బుధవారం రాత్రి ఆర్టీసీ బస్సు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. నడుచుకుంటూ వెళ్తున్న వ్యక్తిని బస్సు ఢీకొట్టగా అక్కడికక్కడే మృతి చెందాడు. ఎస్సై శీలం రవి ఘటనా స్థలికి చేరుకుని విచారణ చేపట్టారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి..

గీసుకొండ : గీసుకొండ పోలీస్ స్టేషన్ పరిధిలోని వరంగల్-నర్సంపేట రహదారిపై జాన్‌పాక వద్ద ఈనెల 19న జరిగిన ప్రమాదంలో గాయపడిన హనుమకొండ జిల్లాలోని కమలాపూర్ మండల పరిధిలోని అంబాలకు చెందిన గంద్రకోట భిక్షపతి (47) ఎంజీఎం ఆస్పత్రిలో చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. మృతుడి కుమారుడు శ్రావణ్‌కుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వెంకన్న తెలిపారు.

అవగాహనతో కుష్టు నిర్మూలన సాధ్యం

● డీఎంహెచ్‌ఓ డాక్టర్ వెంకటరమణ

గీసుకొండ : ప్రజల్లో అవగాహన పెరగడం ద్వారా కుష్టు నిర్మూలన సాధ్యమవుతుందని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి (డీఎంహెచ్‌ఓ) డాక్టర్ కె.వెంకటరమణ తెలిపారు. కుష్టు నివారణ కోసం తన కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వైద్యసిబ్బందితో ఆయన మాట్లాడారు. జిల్లాలో ఈనెల 30 నుంచి ఫిబ్రవరి 13 వరకు లెప్రసీ నిర్మూలన కోసం పక్షోత్సవాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. పీహెచ్‌సీల పరిధిలో వైద్య సిబ్బంది, ఆరోగ్య, ఆశ కార్యకర్తలు బృందాలుగా ఏర్పడి ఇంటింటికీ వెళ్లి అనుమానితులకు పరీక్షలు నిర్వహించాలని తెలిపారు. వ్యాధిపై అవగాహన పెంచేలా పాఠశాలల్లో వ్యాసరచన పోటీలను నిర్వహిస్తామని చెప్పారు. అనంతరం సిబ్బందికి ఐఈసీ కిట్లు అందజేశారు. కార్యక్రమంలో ఫిజియోథెరపిస్ట్ నర్సింహారెడ్డి, అనుపమ సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ వెంకటరమణ

క్రమశిక్షణతో పనిచేస్తే మెరుగైన ఫలితాలు



సమావేశంలో మాట్లాడుతున్న ఈశ్వర్

చెన్నారావుపేట : క్రమశిక్షణతో పని చేస్తే మెరుగైన ఫలితాలు ఖాయమని అసిస్టెంట్ ప్రాజెక్ట్ మేనేజర్ ముక్కెర ఈశ్వర్ తెలిపారు. స్థానిక ఆశాజ్యోతి మండల సమాఖ్య కార్యాలయంలో గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ వీఓఏలతో బుధవారం నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామ పంచాయతీ డెవలప్‌మెంట్ ప్లానింగ్‌లో భాగంగా వీపీఆర్‌పీ యాప్‌పై ఇస్తున్న శిక్షణను వినియోగించుకోవాలని చెప్పారు. నేషనల్ ప్రాజెక్టుకు సంబంధించిన లూకోస్ యాప్‌లో నెలకొన్న వివిధ సమస్యలకు పరిష్కార మార్గాలను వివరించారు. సఖి కార్యాలయం నుంచి మహిళా చట్టాలు, హక్కులు, చేపడుతున్న కార్యక్రమాల గురించి కౌన్సిలర్లు నూర్జహాన్, నిర్మలాదేవి అవగాహన కల్పించాలని చెప్పారు. ప్రాజెక్ట్ పనులను సకాలంలో పూర్తి చేయాలని ఆదేశించారు. సమావేశంలో ఆడిటర్ వెంకట్, సమాఖ్య అధ్యక్షురాలు హైమ, ముంజా లక్ష్మి, సీసీలు కట్టయ్య, మంజుల, సుజాత, శ్రీలత, సిబ్బంది పాల్గొన్నారు.

వాహనదారులు నిబంధనలు పాటించాలి

వర్ధన్నపేట : వాహనదార్లు నిబంధనలు పాటించాలని ఆర్టీఓ స్వర్ణలత సూచించారు. రోడ్డు భద్రత వారోత్సవాల్లో భాగంగా పట్టణంలో కరపత్రాలను వాహనదారులకు బుధవారం ఆమె అందజేసి మాట్లాడారు. వాహనదారులు నిబంధనలు పాటిస్తే రోడ్డు ప్రమాదాల నివారణ సులువౌతుందని తెలిపారు. వాహనం నడిపేటపుడు వాహదారు తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. ఆటోల్లో, ఇతర వాహనాల్లో ప్రయాణికులను సామర్థ్యానికి మించి తీసుకెళ్లవద్దని సూచించారు. వాహనదార్లు డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండడంతోపాటు వాహనానికి ఇన్సూరెన్స్, పొల్యూషన్ సర్టిఫికెట్, ఇతర పత్రాలు వెంట ఉంచుకోవాలని తెలిపారు. మద్యం మత్తులో వాహనం నడపొద్దని స్పష్టం చేశారు. వాహనదార్లు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే రోడ్డు ప్రమాదాలు చోటు చేసుకుని ప్రాణాపాయం తలెత్తి కుటుంబాలు వేదనకు గురయ్యే ప్రమాదం ఉందన్నారు. సమావేశంలో ఆటోడ్రైవర్లు, వాహనదార్లు, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఆర్టీఓ స్వర్ణలత

వైద్యరంగంలో డీప్ లెర్నింగ్ టెక్నాలజీ కీలకం

నర్సంపేట రూరల్ : వైద్యరంగంలో డీప్ లెర్నింగ్ టెక్నాలజీ కీలకమని బాలాజీ విద్యాసంస్థల చైర్మన్ రాజేంద్రప్రసాద్‌రెడ్డి, జేఎన్‌టీయూ ప్రిన్సిపాల్ నర్సింహ తెలిపారు. మండలంలోని బాలాజీ ఇంజనీరింగ్ కళాశాలలో యూజీసీ, జేఎన్‌టీయూ, బిట్స్ సంయుక్త ఆధ్వర్యంలో 'మెడికల్ ఇమేజ్ ఎనాలిసిస్ యూజింగ్ డీప్ లెర్నింగ్'పై శిక్షణ శిబిరాన్ని వారు ముఖ్యఅతిథులుగా హాజరై బుధవారం ప్రారంభించి మాట్లాడారు. ఉపాధ్యాయులు నైపుణ్యాలని పెంచుకునేందుకు రిసోర్స్‌పర్సన్లుగా వ్యవహరిస్తున్న ఐఐటీ, ఎన్ఐటీ, ట్రిపుల్ ఐటీ ప్రొఫెసర్ల సేవలు వినియోగించుకోవాలని చెప్పారు. పాథాలజీ ప్రక్రియలో డీప్ లెర్నింగ్ టెక్నాలజీ సమూల మార్పులు తీసుకొస్తుందని చెప్పారు. కార్యక్రమంలో ఉస్మానియా యూనివర్సిటీ ప్రొఫెసర్ అబ్దుల్ హమీద్, ప్రిన్సిపాల్ హరిహరన్, తదితరులు పాల్గొన్నారు.